ఢిల్లీ ధమాకా

లక్నోపై ఘన విజయం

రాణించిన రాహుల్, పొరెల్ ● ముకేశ్ నాలుగు వికెట్లతో విజృంభణ

పొరెల్ (51)

రాహుల్ (57*)

లక్నో: బౌలర్లతో పాటు బ్యాటర్లూ సమిష్టిగా రాణించడంతో ఢిల్లీ క్యాపిటల్స్ ఈ సీజన్‌లో ఆరో విజయాన్ని నమోదు చేసింది. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు.. ప్రత్యర్థిపై 8 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ఈ సీజన్ ఆరంభంలో ఢిల్లీ చేతిలో ఎదురైన పరాభవానికి బదులు తీర్చుకోవాలన్న లక్నో ఆశలపై నీళ్లు చల్లుతూ.. ఆ జట్టు నిర్దేశించిన 160 పరుగుల లక్ష్యాన్ని 17.5 ఓవర్లలోనే దంచేసింది. రాహుల్ (42 బంతుల్లో 57 నాటౌట్, 3ఫోర్లు, 3సిక్స్‌లు), అభిషేక్ పొరెల్ (36 బంతుల్లో 51, 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలతో రాణించారు. తొలుత లక్నో.. ఢిల్లీ బౌలర్ల ధాటికి 159/6కే పరిమితమైంది. మార్క్‌రమ్ (33 బంతుల్లో 52, 2 ఫోర్లు, 3 సిక్సర్లు) ఆల్‌రౌండ్ (బంతితో 2/30) మెరుపులు వృథా అయ్యాయి. క్యాపిటల్స్ బౌలర్ ముకేశ్ కుమార్ (4/33) లక్నోను దెబ్బతీశాడు.

పొరెల్, రాహుల్ దూకుడు

స్వల్ప ఛేదనను ఢిల్లీ దూకుడుగా ఆడి 17.5 ఓవర్లలోనే దంచేసింది. యువ ఓపెనర్ పొరెల్.. రాహుల్‌తో పాటు అక్షర్ పటేల్ (34 నాటౌట్) ధనాధన్ మెరుపులతో లక్ష్యం మరింత చిన్నదైంది. రెండు బౌండరీలు, ఓ సిక్సర్‌తో ఇన్నింగ్స్‌ను వేగంగా మొదలుపెట్టిన కరుణ్ నాయర్ (15) మార్క్‌రమ్ బౌలింగ్‌లో పెవిలియన్ చేరినా ఈ త్రయం దంచడంతో లక్నోకు ఓటమి తప్పలేదు. పొరెల్ తొలి ఓవర్ నుంచే బౌండరీలతో విరుచుకుపడ్డాడు. బిష్ణోయ్ 11వ ఓవర్లో 83 మీటర్ల భారీ సిక్సర్‌తో పొరెల్ హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. ఇదే ఓవర్లో రాహుల్ కూడా 86 మీటర్ల సిక్సర్ బాదాడు. అయితే మార్క్‌రమ్ 12వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయిన పొరెల్.. డీప్ మిడ్ వికెట్ వద్ద మిల్లర్ చేతికి చిక్కడంతో 69 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. పొరెల్ నిష్క్రమించినా అక్షర్ దూకుడు ఆపలేదు. బిష్ణోయ్ 14వ ఓవర్లో అతడు రెండు భారీ సిక్సర్లు బాదిన అక్షర్.. దిగ్వేశ్ బౌలింగ్‌లోనూ బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు. తన మాజీ జట్టు అయిన లక్నోపై రాహుల్ రాణించడం మ్యాచ్‌లో కొసమెరుపు!

ఓపెనర్లదే ఆట

స్లో టర్నర్ అయిన లక్నో పిచ్.. తొలి ఇన్నింగ్స్‌లో భిన్నంగా స్పందించడంతో పంత్ సేనకు బ్యాటింగ్ తిప్పలు తప్పలేదు. పిచ్ స్వభావం తెలిసిన ఢిల్లీ సారథి అక్షర్.. బౌలింగ్ దాడిని ప్రారంభించడంతో పాటు పవర్ ప్లేలో వరుసగా మూడు ఓవర్లూ (19 పరుగులే ఇచ్చాడు) తానే వేశాడు. మార్ష్ (45) బ్యాట్ ఝుళిపించేందుకు ఇబ్బందులు పడగా.. మార్క్‌రమ్ కూడా ఆరంభంలో తడబడ్డా తర్వాత పుంజుకున్నాడు. ముకేశ్ 4వ ఓవర్లో అతడు 4, 6 కొట్టగా చమీర ఓవర్లో మార్ష్ సిక్సర్‌తో లక్నో 50 పరుగుల మార్కును అందుకుంది. గత ఆరు ఇన్నింగ్స్‌లలో అతడికి ఇది నాలుగో అర్ధ శతకం. కానీ మార్క్‌రమ్, మార్ష్ క్రీజులో ఉన్నా 10 ఓవర్లకు లక్నో చేసింది 87 పరుగులే. 9వ ఓవర్ ఆఖరి బంతికి చమీర.. మార్క్‌రమ్‌ను ఔట్ చేసి 87 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. పూరన్ (9)ను స్టార్క్ బోల్తా కొట్టించాడు. ముకేశ్ 14వ ఓవర్లో.. సమద్ (2)తో పాటు మార్ష్‌నూ ఔట్ చేసి లక్నోకు డబుల్ షాకులిచ్చాడు. బదోని (21 బంతుల్లో 36, 6 ఫోర్లు) వేగంగా ఆడగా 15 బంతులెదుర్కున్న మిల్లర్ (14 నాటౌట్) ధాటిగా ఆడలేకపోయాడు.

సంక్షిప్త స్కోర్లు

లక్నో: 20 ఓవర్లలో 159/6 (మార్క్‌రమ్ 52, మార్ష్ 45, ముకేశ్ 4/33, స్టార్క్ 1/25);
ఢిల్లీ: 17.5 ఓవర్లలో 161/2(రాహుల్ 57 నాటౌట్, పొరెల్ 51, మార్క్‌రమ్ 2/30)

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
గుజరాత్	8	6	2	12	1.10
ఢిల్లీ	8	6	2	12	0.65
బెంగళూరు	8	5	3	10	0.47
పంజాబ్	8	5	3	10	0.17
లక్నో	9	5	4	10	-0.05
ముంబై	8	4	4	8	0.48
కోల్‌కతా	8	3	5	6	0.21
రాజస్థాన్	8	2	6	4	-0.63
హైదరాబాద్	7	2	5	4	-1.21
చెన్నై	8	2	6	4	-1.39

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

నందినికి స్వర్ణం

కొచ్చి: కేరళ వేదికగా జరుగుతున్న 28వ జాతీయ ఫెడరేషన్ కప్ సీనియర్ అథ్లెటిక్స్ టోర్నీలో తెలంగాణ పతక జోరు కొనసాగుతున్నది. పోటీల రెండో రోజైన మంగళవారం యువ అథ్లెట్ అగసర నందిని పసిడి పతకంతో మెరిసింది. మహిళల హెప్టాథ్లాన్‌లో బరిలోకి దిగిన నందిని మొత్తం 5813 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం సొంతం చేసుకుంది. 100మీ హర్డిల్స్ (13.75సె), హైజంప్ (1.65మీ), షాట్‌పుట్ (13.49మీ), 200మీ (23.63సె), లాంగ్‌జంప్ (6.01మీ), జావెలిన్‌త్రో (32.38మీ), 800మీ (2:15:70సె) విభాగాల్లో నందిని అద్భుత ప్రదర్శన కనబరిచింది.

రెండో రౌండ్‌లో అమన్

ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్

అమ్మాన్(జోర్డాన్): ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతున్నది. మంగళవారం జరిగిన బాలుర అండర్-17 63కిలోల తొలి రౌండ్‌లో భారత యువ బాక్సర్ అమన్ సివాచ్ 4-1తో అబుబకీర్ దుషీవ్(కిర్గిస్థాన్)పై అద్భుత విజయం సాధించాడు. ఆది నుంచే తనదైన జోరు కనబరిచిన అమన్..ప్రత్యర్థి బాక్సర్‌పై పదునైన పంచ్‌లతో చెలరేగాడు.

ఐదుగురు చెస్ ప్లేయర్లకు ఆర్థిక ప్రోత్సాహం

హైదరాబాద్: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న యువ చెస్ ప్లేయర్లకు ఆర్థిక ప్రోత్సాహం లభించింది. మంగళవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ మాస్టర్ వంతికా అగర్వాల్‌తో పాటు శుభి గుప్తా, చార్వి అనిల్‌కుమార్, సరయు వేల్పుల, సాహితి వర్షిణికి 64 స్క్వేర్స్‌తో పాటు చెస్ స్టార్టప్ కంపెనీ ఎమ్‌జీడీ1 అండగా నిలిచాయి. ఏడాది పాటు ఈ ఐదుగురు ప్లేయర్లు టోర్నీల్లో పోటీపడేందుకు అయ్యే ఖర్చులు, శిక్షణను భరించనున్నాయి.

సగం ముగిసింది.. అసలు కథ ముందుంది

గత నెల 22న అట్టహాసంగా మొదలైన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో ఒక అంకం ముగిసింది! రెండు నెలల పాటు 74 మ్యాచ్ (70 లీగ్, 4 నాకౌట్)లుగా సాగే ఈ ధనాధన్ క్రికెట్ సంరంభంలో ఏప్రిల్ 22న జరిగిన లక్నో X ఢిల్లీ పోరుతో 40 మ్యాచ్‌లు ముగిశాయి. ఇప్పటి దాకా జరిగిన మ్యాచ్‌లు ఒకెత్తు అయితే ఇక నుంచి ఆడబోయే ప్రతి పోరు అన్ని జట్లకూ అత్యంత కీలకం.

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

లాస్ట్ ఓవర్ థ్రిల్లర్‌లు, హైస్కోరింగ్ ధనాధన్‌లు, అనామక ఆటగాళ్ల మెరుపులు, స్టార్ క్రికెటర్ల గ్రహపాటు, అగ్రశ్రేణి జట్ల తడబాటు.. వెరసి ఐపీఎల్-18 రసవత్తరంగా సాగుతున్నది. దేశంలోని 13 నగరాల్లో జరుగుతున్న ఈ క్యాష్ రిచ్ లీగ్.. గత నెల 22న మొదలై మంగళవారంతో నెల రోజులు పూర్తై 74 మ్యాచ్‌లలో 40 మ్యాచ్‌లు ముగిశాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ (7 మ్యాచ్‌లు) తప్ప అన్ని జట్లూ తలా 8 మ్యాచ్‌లు (లక్నో, ఢిల్లీ మ్యాచ్‌కు ముందు) ఆడేశాయి. ఎవరూ ఊహించని రీతిలో ఇప్పటి దాకా ట్రోఫీని దక్కించుకోని ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, లక్నో సూపర్ జెయింట్స్ వంటి జట్లు పాయింట్ల పట్టికలో టాప్-5లో ఉంటూ ప్లేఆఫ్స్ రేసులోకి దూసుకుపోతుంటే ఈ లీగ్‌లో అత్యంత విజయవంతమైన జట్టైన చెన్నై సూపర్ కింగ్స్ మాత్రం ఆడిన 8 మ్యాచ్‌లకు గాను రెండింట్లోనే గెలిచి ఆరు ఓడి అట్టడుగున నిలవగా గత సీజన్ రన్నరప్ సన్‌రైజర్స్.. ఐదింట్లో ఓడింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ రెండు జట్లతో పాటు ఐపీఎల్ తొలి సీజన్ విజేత రాజస్థాన్ రాయల్స్ (6 ఓటములు) ప్లేఆఫ్స్ ఆశలు అటకెక్కినట్టే. సీజన్ ఆరంభంలో తడబడ్డా హ్యాట్రిక్ విజయాలతో కాస్త పుంజుకున్న ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్ దిశగా సాగుతున్నది.

కుర్రాళ్లు.. లోకల్ లీగ్‌లు..

ప్రతి సీజన్ మాదిరిగానే 2025లోనూ ఐపీఎల్‌కు కొత్త నీరు వరదలా వెల్లువెత్తుతున్నది. ప్రియాన్ష్ ఆర్య, దిగ్వేశ్ రాఠి, విప్రాజ్ నిగమ్, అనికేత్ వర్మ, విఘ్నేశ్ పుతుర్, అశ్వనీ కుమార్, షేక్ రషీద్ వంటి కుర్రాళ్లతో పాటు ఇంకా పాఠశాల వయసు కూడా దాటని 14 ఏండ్ల వైభవ్ సూర్యవంశీ, 17 ఏండ్ల అయుశ్ మాత్రె.. అవకాశమిస్తే సత్తాచాటేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రపంచానికి చాటి చెప్పారు. పైన పేర్కొన్నవారికి దేశవాళీ ఆడిన అనుభవమూ లేదు. ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో మెరిసిన ఆర్య, దిగ్వేశ్.. పంజాబ్, లక్నో విజయాల్లో కీలకపాత్ర పోషిస్తుండగా ఉత్తరప్రదేశ్ ప్రీమియర్ లీగ్‌లో సత్తాచాటిన విప్రాజ్ ఢిల్లీకి కీ ప్లేయర్ అయ్యాడు. మధ్యప్రదేశ్ లీగ్‌లో రాణించిన అనికేత్ వర్మ.. సన్‌రైజర్స్ లోయరార్డర్‌లో మెరుపులు మెరిపిస్తున్నాడు. కొత్త కుర్రాళ్లు సత్తా చాటుతున్న ఈ లీగ్‌లో లీగ్‌లో అత్యధిక ధర దక్కించుకున్న రిషభ్ పంత్‌తో పాటు, వెంకటేశ్ అయ్యర్, రషీద్ ఖాన్, రవి బిష్ణోయ్, యుజ్వేంద్ర చాహల్, అశ్విన్, జడేజా వంటి స్టార్ ప్లేయర్లు మాత్రం వైఫల్య ప్రదర్శనతో అభిమానులను విసిగిస్తున్నారు.

సలైవా.. గేమ్ ఛేంజర్

తొలి రెండు వారాలు భారీ స్కోర్లు నమోదైన ఈ సీజన్‌లో బౌలర్లకు పీడకలలే మిగిలాయి. కానీ తర్వాత పరిస్థితి కాస్త మారింది. బౌలర్లు కూడా సత్తా చాటుతూ విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. రాజస్థాన్ ఓడిన చివరి రెండు మ్యాచ్‌లు (ఢిల్లీ, లక్నోతో) ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. బంతికి ఉమ్మి రాయొచ్చునని ఈ సీజన్‌కు ముందు బీసీసీఐ తీసుకున్న నిర్ణయం.. ఈ సీజన్‌లో గేమ్ ఛేంజర్ అయింది. దీనిని ఉపయోగించుకుని స్టార్క్, సిరాజ్, భువనేశ్వర్, హాజిల్‌వుడ్, మోహిత్ శర్మ, అవేశ్ ఖాన్ వంటి పేసర్లు అంచనాలకు మించి రాణిస్తున్నారు. హైదరాబాద్, ఢిల్లీ, కోల్‌కతా వంటి నిర్జీవమైన పిచ్‌లను మినహాయిస్తే మిగిలిన వేదికల్లో పిచ్‌ల నుంచి బౌలర్లకు మంచి సహకారం అందుతున్నది.

కోటలు కూలుతున్నై!

సొంత వేదికల్లో ఘనమైన రికార్డులు కలిగిన కొన్ని జట్లకు ఈ సీజన్‌లో ఘోరపరాభవాలు తప్పడం లేదు. చెపాక్‌లో చెన్నైకి, చిన్నస్వామిలో బెంగళూరుకు, వాంఖడేలో ముంబైకి, ఈడెన్ గార్డెన్స్‌లో నైట్‌రైడర్స్‌కు భంగపాటు తప్పలేదు. ఐపీఎల్ ఆరంభ సీజన్ నుంచి తాజా సీజన్ దాకా ఆర్‌సీబీ, ఢిల్లీ చేతిలో ఓడిపోని చెన్నైకి ఈ సీజన్‌లో ఓటములు ఎదురయ్యాయి. అభిమానుల మద్దతు నిండుగా ఉండే చిన్నస్వామిలో ఇప్పటిదాకా ఆడిన మూడు మ్యాచ్‌లలోనూ బెంగళూరు బోణీ కొట్టలేదు. వాంఖడేలో దశాబ్దకాలంగా గెలుపెరగని రాయల్ చాలెంజర్స్.. ఈ సీజన్‌లో ఆ గోడను బద్దలుకొట్టింది. ఈడెన్ గార్డెన్స్‌లో ఆడిన 4 మ్యాచ్‌లలో కోల్‌కతాకు 3 ఓటములే పలకరించాయి. స్లో టర్నర్‌గా పేరున్న లక్నో పిచ్‌పైనా ఆ జట్టు తడబడుతుండగా జైపూర్‌లో నాలుగు మ్యాచ్‌లు ఆడిన రాజస్థాన్.. మూడింట్లోనూ ఓటములే మూటగట్టుకుంది.

కేరళ పోలీసు క్రీడల్లో తెలంగాణకు 18 పతకాలు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): కొచ్చి(కేరళ) వేదికగా జరిగిన ఆల్‌ఇండియా పోలీస్ స్పోర్ట్స్ టోర్నీలో తెలంగాణ పోలీసులు సత్తాచాటారు. ఈనెల 11 నుంచి 15వ వరకు జరిగిన బ్యాడ్మింటన్, టీటీ పోటీల్లో మన పోలీస్ ప్లేయర్లు రెండు స్వర్ణాలు సహా రెండు రజతాలు, 14 కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐజీ రమేశ్, డీఎస్పీ రామారావు పాల్గొన్నారు.

సంయుక్తంగా ఆధిక్యంలో హంపి, జినర్

పుణె: ఫిడే వుమెన్స్ గ్రాండ్ ప్రిక్స్‌లో భారత గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపితో పాటు చైనాఅమ్మాయి ఝు జినర్ సంయుక్తంగా ఆధిక్యాన్ని సాధించారు. 8 రౌండ్లు పూర్తైన ఈ టోర్నీలో హంపి, జినర్ తలా 6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. మంగళవారం ముగిసిన 8వ రౌండ్ గేమ్‌ను హంపి డ్రా చేసుకోగా.. దివ్య దేశ్‌ముఖ్‌ను ఓడించిన జినర్ కీలక పాయింట్‌ను దక్కించుకుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.